# బదిలీ

నాకు ప్రపంచంలేదు. బదిలీ అయిపోయింది. నాలోకి బదిలీ అయిపోయింది. ఇప్పుడు నేనే ప్రపంచాన్ని.

వాళ్ళందరూ నాకు పిచ్చి అంటున్నారు. మతి పోయిందంటున్నారు. 'ఈ ప్రపంచంలోలేదు' అంటున్నారు.

నా మతి... మతి... ఎక్కడకు పోయింది? నాకు వాళ్ళు పిచ్చివాళ్ళుగా కనబడుతున్నారు. వాళ్ళు అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారు. నాకు ఒకటేగా నవ్వొస్తుంది వాళ్లను చూస్తుంటే, వాళ్ల మాటలు వింటుంటే. ఈ 'పిచ్చి' నా 'మతి' కాదూ? నేను ఇప్పుడు పూర్తిగా నా ప్రపంచంలోనే, నా పిచ్చిలోనే వుంటున్నాను. ఆ ప్రపంచం యిప్పుడు బాగా లేదు.

నామీద నాకు ఒకటే జాలేస్తోంది. ఆ ప్రపంచం పోయింది కదూ. అందుకని. పోయింది తిరిగి రాదు. ఇదివరకు అక్కడ ఆనంద వుండేవాడు. అందరూ వుండేవారు. ఇప్పుడు లేరు. అందుకని నేను ఎప్పుడూ ఈ ప్రపంచంలోనే. నా ప్రపంచంలోనే, నా మతిలోనే ఉండిపోవాలి. యిహ నాకు విముక్తి లేదు... నేను పిచ్చిదాన్నని రాము, జగన్ దగ్గరకు రావటం లేదు. ఆయనా దగ్గరికి రావటం లేదు. అంటే యోగక్షేమాలు కనుక్కుంటున్నారు గాని సంభాషించడం లేదు. నేను పిచ్చిదాన్నికదూ. ఈ ప్రపంచంలో లేను కదూ, మతిలేదు కదూ-అందుకని. అదంతా నాకు అర్థంకాదని...అదీ నిజమే! అర్థం చేసుకోగలిగితే పిచ్చి అనరుకదా...కాని నా ఆనందవుంటే ఇట్లా చేసేవాడా? ఎన్నటికీ చెయ్యడు! పిచ్చి అమ్మనీ 'అమ్మా' అని కావిలించుకునేవాడు. పిచ్చి, తెలివి, అర్థం-ఇట్లాంటివన్నీ వాడికక్కర్లేదు. వాడు యిప్పుడెక్కడున్నాడు?...వాడు చచ్చిపోయాడు, లేడు అంటున్నారు. వాడు నిజంగా లేడూ? లేడూ?... నిజం నిజమంటే ఏమిటి? నిజమూ అబద్ధమూ ఒకటే అయ్యుండాలి. ఎందుకంటే వాడు నాకు కనిపిస్తున్నాడు. బంగారపు బొమ్మలాగా ఒళ్ళు మెరిసిపోతుంటే, పెద్దబొజ్జతో దిసమొలతో, కళ్ళల్లో నవ్వు తుళ్ళిపడుతుంటే, మొహం వెలిగిపోతుంటే, చిలిపి కృష్ణుడిలాగా నాకు

స్పష్టంగా ప్రత్యక్షంగా అందరూ కనిపిస్తున్నట్లు కనిపిస్తుంటేనూ!... మరి వాళ్లు లేడంటున్నారే! వాళ్ళ ప్రపంచంలోనుండీ నా ప్రపంచంలోనికి, వాళ్ళ మతిలోనుండీ నా మతిలోనికి నడిచి వచ్చేశాడా?... అంతే అయ్యుండాలి!

...అబ్బ! నామనసు కలగిపోతున్నది. అందులోనికి భరించరాని వేదన వచ్చేస్తున్నది. అమృతంకోసం దేవదానవులు మంథరపర్వతంతో మథిస్తున్నప్పటి పాలసముద్రంలాగ అయిపోతున్నది... అయిపోతున్నది... ఈ బాధ నే భరించలేనే... అయ్యో!

ఇంతసేపూ ఏడ్చిన ఏడుపులోనుంచీ నవ్వు పైకొస్తున్నది. చిలికిన మజ్జిగలోంచి తేలిగ్గా వెన్నముద్ద పైకొచ్చినట్లు. ఏడుపు, నవ్వు-నవ్వు, ఏడుపు- అవి రెండూ వేరువేరా? ఒకటేనా?

నాలో ఏదో తెలివి పుట్టుకొస్తున్నది. నా నవ్వూ ఏడుపూ నాకు కనిపిస్తున్నది. అవతలివాళ్ళను బోల్తా కొట్టిస్తున్నానన్న ఆనందంతో పిచ్చివాడు చాటునుంచీ తొంగి చూస్తున్నట్లు- అవును, సరిగ్గా అలానే నా మనసులోనికి తొంగి చూస్తున్నాను...

...నేనూ నా మనసూ ఒకటే అయితే ఆ తొంగిచూస్తున్నదెవరు!

అమ్మో! నేను 'అది' కానందుకు సంతోషం. ఆ నిరాశా సముద్రాన్ని నేనీదలేను. ఆ నిస్పృహా పర్వతాల్ని నేనెక్కలేను. నేను వేరుగానే వుంటాను... 'అది' ఏమిటి? మనసంటే ఏమిటి? ఆశలూ అనుభవాలూ అంటూ దాన్నే పోగేసి ఎంత కొండను కట్టాను! ఎంత సముద్రాన్ని సృష్టించాను... అంతా బూడిదైపోయింది. ఆశలు కాలిపోయిన బూడిద...దాన్ని భరించలేను!

...దీనికంతటికీ మూలకారణం ఏమిటని ఆలోచించాను. ఆశ లేకుంటే నిరాశ రాదు. నిరాశనుండి పుట్టేది నిస్పృహ. కావాలన్నది దొరకనప్పుడు దొరికినదాన్ని చూడలేము. ఆశ- అంటే ఎదురుచూడటం-అన్ని అనర్థాలకీ మూలకారణంగా వున్నది... అరె! ఇంత గొప్ప ముఖ్యమైన విషయం నిజానికి ఎంత చిన్నదిగా వున్నది!... ఇదే విషయం ఇదివరలో ఎవరో గొప్పవాళ్ళు చెప్పినట్లూ, విన్నట్లూ ఉన్నదే!... ఈ విషయం చెయ్యిజారి పోగూడదు. రామూని పిలిచాను. ఇంకా ఆ జ్వరంవాడిని పీడిస్తున్నట్లున్నది. సన్నగా అయిపోయాడు. "దేనికోసమూ ఎదురుచూడకూడదు. ఇది చాలా ముఖ్యమైన జీవిత సత్యం. జ్ఞాపకం పెట్టుకో-మంచిది" అని చెప్పాను. వాడు పారిపోయాడు.

ఆనంద అయితే పారిపోయి వుండేవాడు కాదు... ఇంత గొప్ప జీవిత సత్యాన్ని కనుక్కున్నానుగదా. ఇంకా వాడు బతికిరాలేదే...

అన్నట్లు ఆనందను గురించి మీకు తెలియదుకదూ. ఎట్లా తెలుస్తుంది! వాడిని చూపిస్తే కనుక్కుంటారేమో కాని చూపించడానికి వాడు ఈ ప్రపంచంలోలేడు. నా

నిరాశలో నిస్పృహలో మునిగి మాయమై పోయాడు. పోనీ వాడినిగురించి చెప్దామంటే చెప్తే వినబడేవి మాటలే కదా. వాడు కాదే. ఎట్లా ఈ సమస్యను తీర్చేది?!... ఆ, వాడిని చూసినా వాడిని తెలుసుకునే తెలివి మీకున్నదన్న నమ్మకం నాకు లేదు... వాడు నా ఆత్మ, నా ప్రాణానికి మూలం అంటే తెలుస్తుందా? తెలియదు... నా ఆనందం అంటే తెలుస్తుందా? సంతోషం కాదు, ఆనందం. ప్రపంచానుభవాల్తో సంబంధంలేనిది, వాటిమీద ఆధారపడనిది, వాటన్నిటినీ సంతోషంగా తేలిగ్గా తీసుకోనిచ్చేది. తెలిసిందా? తెలియలేదు... ఎప్పుడూ నవ్వుతూ, కడిగిన ముత్యంలాగా మెరిసిపోతూ వుంటాడు. వాడిని చూస్తే గుండెనిండిపోతుంది-ఇప్పుడు తెలిసిందా?... కొంచెం తెలిసినట్లుంది. వాడే నా ఆనంద! నాకొడుకు! నేను!

★★★

ఇవాళ నా మనసు తేటగా వున్నది. కన్నీటి ముత్యాలమంచులో తడిసిపోయిన ఆ ప్రపంచం స్పష్టంగా కనిపిస్తున్నది. జరిగిందంతా గుర్తుకొస్తున్నది. ఆనంద లేకుండాపోయి రెండు నెలలుదాటిపోయింది. ఇంకా మాకు బదిలీ రాలేదు.

ఈ చింతలూరికి రాకపూర్వం మేము బాగానేవుండేవాళ్ళం. కష్టం సుఖం కలిసివొచ్చినా, సుఖంకూడా వుండేది. మనుషుల్లో నిజాయితీ, ప్రపంచంలో స్థిరత్వం వున్నట్లు కనబడేది. లోకంపోకడ అర్థం అవుతున్నట్లుండేది. మనుష్యులకు కొన్ని విలువలుండేవి.ఏదో ఒక అధికారానికి లోబడినా, స్థిరత్వం కనిపించేది. ఈ ప్రపంచం మాకు సంబంధించినదిగా, మేము అందులోని వాళ్ళంగా తోచేది. మనిషిని తికమకపరచి క్రుంగదీసి నిర్జీవం చేసే పరిస్థితులు అప్పటికి ఎదురవలేదు.

ఈ ఊళ్ళో సుఖదేవ్-అబ్బ, ఏం పేరో!... ఉండేవారు. ఇక్కడ నాలుగునెల లుండేసరికి అతనికి వెళ్ళిపోవాలని అనిపించిందట. హైదరాబాదుకు వెళ్ళి ఎట్లాగో ఈ మార్పు చేయించారు. తత్ఫలితంగా మేము చింతలూరికి రావలసివచ్చింది.

అనారోగ్యానికి పేరుగాంచిన చిన్న వూరు ఇది. ఆర్డరు కాగితం చూడగానే ఆయన నిరుత్సాహంతో నీరుగారిపోయారు. తల పట్టుకొని

"ఆ వూరా? అక్కడికి వెళ్తే మనం తిరిగి బయటపడటం జరగదు" అన్నారు.

ఆయన అవతారం చూస్తే నాకు నవ్వొచ్చింది. ఆయన చిన్నతనంలో చాలా బలహీనంగా వుండేవారట. ఇంటిల్లిపాదీ ఆయన ఆరోగ్యం గురించి అహర్నిశలూ శ్రద్ధ తీసుకుని పాటుపడుతూ వుండేవారట. అదే అలవాటుమీద ఇప్పటికీ ఆయన తనొక పింగాణి బొమ్మననీ, చాలా జాగ్రత్తగా వుండకపోతే ఏ నిముషాన్నో బ్రద్దలైపోవచ్చుననీ అనుకుంటున్నట్లుంటారు.

"బయటపడక ఏమైపోతాం?" అన్నాను పెద్దగా నవ్వుతూ.

అప్పుడు ఆనంద నా ఒళ్లో పడుకునున్నట్లు నాకుబాగా గుర్తు.

"ఆ వూరికెళ్ళాలని ఎవరికీ ఇష్టం వుండదు. మనం అక్కడే చిక్కుబడిపోతాం" అన్నారు.

"మీస్నేహితులు సుఖదేవ్‌గారు వెళ్ళలేదూ? మనం అట్లాగే వెళ్లొచ్చును లెండి... కొత్త ప్రాంతం చూడొచ్చును. అన్నిటికీ అంత దిగజారిపోతే ఎట్లాగ?" అన్నాను, ఓదార్చాలనే సదుద్దేశ్యంతో.

అప్పుడు నాలో ఏవిధమైన జంకుగాని అధైర్యంగాని లేవు. రాబోయేదాన్ని మంచిగాని, చెడ్డగాని ముందుగా ఊహించుకోవడం నాకు అలవాటులేదు. దేనికోసమైనా ఎదురుచూడటం నా తత్వానికే విరుద్ధం. నా ఆలోచనలూ ఆవేశాలూ పనులూ అన్నీ ఆ క్షణంలోనుంచీ పుట్టుకొచ్చేవే.

ఆయన అట్లాగ కాదు. పైకి కనిపించే సౌమ్యత బలహీనతల వెనుక చాలా గట్టిదనం, మొండితనం వున్నాయని నాకు అనుభవమే. ఆయన ఏదైనా అనుకున్నారంటే మార్చటం నాకు తరం కాదు. ఈ విషయంలోనూ అంతే అయ్యింది.

ఆ ప్రయాణం నాకు బాగా గుర్తున్నది. స్టేషనునుంచీ తూర్పుగా పదిమైళ్ల దూరంలో వున్నది చింతలూరు... టాక్సీ మెల్లగా పోతున్నది. మధ్యలో ఊళ్ళుకూడా తగలటం లేదు. ఉదయంనుండీ రైల్లో ప్రయాణంతో విసిగిపోయివున్నాం, అలసటతో దుమ్ములో. రోడ్డు అంతంలేనట్లుగా వొంపులు తిరిగిపోతూ సంధ్యచీకట్లోకి సాగిపోతున్నది. రెండువైపులా ఏపుగా ఎదిగిన పైర్లు ఈ ప్రక్కా ఆ ప్రక్కా దడికట్టేసినట్లున్నాయి. ఎక్కడో గుహలో అనంతమైన ప్రయాణంలాగా ఉన్నది. ఆ గుహలోనికి పోయిపోయి ఎక్కడో మాయమైపోతాము, ఇహ తిరిగి రాకుండా! అనిపించింది. చెప్పలేని భయం తామరాకు నీడ మీద వ్రాలినట్లు గుండెనిండా ఏదో బరువు, దిగులు.

టాక్సీ ఆగిపోయింది. పెట్రోలు అయిపోయింది. డ్రైవరు వెనక్కి నడిచి వెళ్ళాడు పెట్రోలు తేవడానికి. చీకటీ, ఎరగనిచోటూ, అక్కణ్నుంచీ కదల్లేకుండా చిక్కుకొని పోయిన మేమూ... మాతృగర్భంలాంటి మహాశూన్యంలో ఉక్కిరిబిక్కిరవుతూన్న ప్రాణాలు. బయటి ప్రపంచంతో సంబంధంలేకుండా ఎక్కడో విసిరేసినట్లుగా వున్న ఆ వూరితో మాకేమి సంబంధం? అక్కడికి ఎందుకు వెళ్ళాలి? ఈ చీకాకులోనుంచీ తప్పించుకొని వెళ్లగలిగితే ఎంత బాగుంటుంది? ఏదో చెరలో చిక్కుకున్నట్లు ఉక్కిరి బిక్కిరైంది

ఏడేళ్ల రామూ, ఆరేళ్ల జగన్ వాళ్ళ నాన్నగారితో మాట్లాడుతూ కూర్చున్నారు. నా ఒళ్లో పడుకున్న ఆనంద లేచాడు. కారు నిలిచిపోయినందున ఉక్కకు చెమటపట్టి ఏడుపు ప్రారంభించాడు. ప్రయాణంలో విసిగిపోయిన నేను వాడికి ఒక్కటి అంటించాను. ఇంకా పెద్దగా ఏడిచాడు. నా విసుగూ నా కారణాలూ వాడికి అక్కర్లేదు. వాడిది నిజంగా

ఏడుపుకూడా కాదు... కేకలు... బొద్దుగా లేతగా నవనవలాడుతూ ఒళ్ళో పడుకుని కేకలేస్తున్నాడు.

నాకు విసుగంతా ఎగిరిపోయి నవ్వొచ్చింది. రెణ్ణెల్ల పిల్లవాడు. వాడిని చూసినప్పుడు వీడు నిజంగా నా కడుపులోనుంచీ పుట్టాడా? అనుకుంటాను. ఆనందం కలుగుతుంది. వాడింకా నాలోనే ఉన్నట్లు, వాడూ నేనూ ఒకటే అయినట్లు. అనిపిస్తుంది.

కొంచెంసేపు విసిరేసరికి ఏడుపు మానేశాడు. పాలు తాగుతూ, ఉన్నట్లుండి మధ్యలో తాగటం మరచిపోయి, నన్ను పరిశీలించడం ప్రారంభించాడు. తెల్లటి వెడల్పాంటి ముఖంలోనుంచీ కుంకుడు గింజల్లాంటి కనుపాపల్తో కొత్తగా వింతగా పరిశీలనగా వాడు నన్ను చూస్తుంటే నవ్వొచ్చింది... వాడు పుట్టాలని ఇంట్లో ఎవరూ కోరుకోలేదు. ఇద్దరు కొడుకులు చాలన్నారు ఆయన.

విషయం తెలియగానే "నీకింకా పిల్లలెందుకు?" అన్నది అత్తగారు దోషిని చూసినట్లు చూస్తూ. చేతుల్తో కాకుండా కళ్ళతో మొట్టికాయలు వెయ్యటం మీకు తెలుసా? ఆవిడ నన్ను మొట్టింది. నాకు ఆడపిల్ల పుడుతుందేమో ననుకున్నాను. 'ఆనందమయి' అన్నపేరు ఏర్పాటు చేసుకున్నాను. వాడికి 'ఆనందకృష్ణ' అన్న పేరు పెట్టుకున్నాను... రామూ జగన్‌లంటే నాకు ప్రేమవున్నది. కాని ఆనందతోడి బంధం వేరు... అది అనిర్వచనీయమైనది.

టాక్సీ ఒక వాకిటిముందు ఆగింది. ఎత్తయిన గోడలు. గోడంత ఎత్తునా రేకు తలుపులు. అందులో మూసుకుపోయి లోపల ఎక్కడో కొద్దిగా కనిపిస్తున్నది మేడ. ఇరవై అడుగుల పొడవున ఇనప ట్రెల్లిస్‌తో రెండంతస్థుల ఎత్తున ఘనంగా వుంది.

"ఈ ఇంట్లో పైనా, క్రిందనా, ఎడంవైపునా, కుడివైపునా...ఎక్కడ మనం వుండబోయేది?" అనడిగాను. "అంతట్లోనూ" అన్నారు.

ఆ యిల్లు చాలా విచిత్రమైన మనసుకల మనుష్యులు కట్టించి నట్లుంది. సత్రంలో విడిగా అద్దెకిచ్చే గదుల్లాగా క్రిందివరుసలో మూడు, పై వరుసలో మూడు గదులు వరుసగా ఉన్నై. అంతే ఇల్లు. అవే వంటకు, స్నానానికి, భోజనానికి, పడుకోడానికి ఏ వరుసలో ఎట్లానైనా ఉపయోగించుకోవచ్చును.

ఇల్లంతా చూసి ముందర ఖాళీ చోటు లోకి వచ్చి నిలుచున్నాను. మనసంతా ఏదో తెలియని గుబులు ఆవరించుకున్నది. చుట్టూ ఎత్తయిన గోడలతో మనుషుల్ని మ్రింగే భూతంలాగా వున్నది ఇల్లు. మనుష్యులు నివసించే ఇంటిలాగా అనిపించలేదు. ఏదో అస్పష్టమైన జ్ఞాపకం లీలగా మెదుల్తున్నది మనసులో... ఈ ఇంటిని ఇదివరలో ఎక్కడో చూశానా? ఊహలోనా? కలలోనా? మరో జన్మలోనా??... ఇదెక్కడి భూతగృహం...

ఇరుగుపొరుగులూ పనివాళ్ళూ యీ యింటి గురించిన వివరాలు తెలిపారు. ఇంటివారికి పిల్లలు లేరు. వాళ్ళు చాలా ఘరానాగా వుండేవాళ్లు. పై అంతస్థు కట్టించాక జబ్బులపాలై, యిల్లు అచ్చిరాలేదని, ఊరు వదిలి, ప్రక్కనే ఉన్న పట్టణానికి వెళ్లిపోయారు. తరువాత ఇద్దరు ముగ్గురు ఆ ఇంట్లో చేరి జబ్బులు చేసి, భయపడి వెళ్ళిపోయారట. ఇప్పుడు మేము చేరాము... ఈ ఇంట్లో వుండే దయ్యం గురించి రెండు మూడు రకాలుగా చెప్పారు. ఆస్తికోసం ఇంటివారి పూర్వులు చంపిన ముసలమ్మ తాలూకు దయ్యం అని అంటారు కొందరు. కాదు, ప్రక్కరోడ్డులో కరెంటు షాకు తగిలి చచ్చిపోయిన అమ్మాయిది అంటారు కొందరు. దాన్ని చూశామంటున్నవాళ్ళందరూ అది తెల్లచీర కట్టుకుని ముసుగు కప్పుకుంటుందని ఒప్పుకుంటున్నారు. కాని దాని వయసు విషయంలో భేదాభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. మొత్తానికి ఆడదయ్యం. ఇంట్లో వాళ్ళకు జబ్బులు కల్పించి పీడిస్తుంది. అంతవరకూ ఖచ్చితంగా చెబుతున్నారు.

దయ్యాలని మేము ఎప్పుడూ చూడలేదు. అవి ఉన్నవనుకోడానికి ఆధారం కనపడలేదు ఇంతవరకూ. అందువలన నిశ్చింతగానే వున్నాం.

నెలరోజులకి ఆయనకి ఏమిటో జ్వరం వచ్చింది. టాన్సిలైటిస్ అనీ ఫ్లూ అనీ టైఫాయిడ్‌గావచ్చుననీ, ఎందుకైనా పనికొస్తుందని క్లోరోమైసిటిన్ ఇచ్చారు. దానితో ఆ జ్వరం తగ్గిందిగాని అప్పణ్ణుంచీ నడుంనొప్పనీ, కాలునొప్పనీ జలుబనీ నీరసమనీ ఆకలిలేదనీ అజీర్ణమనీ రోజూ ఏదో ఒకటి చెప్తున్నారు. మందిచ్చిన డాక్టరుగారు జబ్బేమీ లేదని చెప్పి టానిక్కు ఒకటి ఇచ్చారు. 'అయ్యగారు చాలా తీసిపోతున్నారు' అని అందరూ అంటున్నారు. 'ఈఊరు రావడం యిష్టంలేక కలిగిన మానసిక రుగ్మత. జబ్బేమీ లేదని డాక్టరు చెప్పలేదా' అనుకున్నాను. చేజేతులా జబ్బులు కోరి తెచ్చుకుం టున్నందుకు ఆయనమీద కోపమూ విసుగూ కలిగాయి.

జగన్‌కి జ్వరం వచ్చి తగ్గి కాలు వాచింది. బోదకాలు యిక్కడ జాస్తి అట. భయపడిపోయి వాడికి మందులిప్పించడం, కాలికి గట్టిగా కట్లుకట్టడాల్లో మునిగిపోయాం. అంతలో రాముకి రుమాటిక్ జ్వరమట, అది వొచ్చింది. డాక్టరుకోసం పట్నం చుట్టూ తిరగటం పెద్దపనైపోయింది.

ఒకసారి డాక్టరుగారింటికెళ్ళినప్పుడు యదాలాపంగా తూకాలు చూసుకున్నాం. నేను ఆనందా బరువు ఎక్కాం. రామూ, జగన్‌లు కొంచెం తగ్గారు. ఆయన చూసుకుని 'ఈ ఆరునెలల్లో ఇరవై అయిదు పౌనులు తగ్గాను' అన్నారు నీరసంగా. ఆ మాట వినగానే నాకు ఒళ్ళు ఝల్లుమన్నది. ఆయన్ని పరిశీలనగా చూచాను. రోజూ చూస్తుండటంవలన నేను గమనించలేకపోయానుగాని ఆయన ఒళ్లంతా కరిగిపోయి చాలా బలహీనం అయిపో యారు! ఎన్నో భయాలు, చెప్పలేని అనుమానాలు ఒక్కసారిగా ముసురుకొచ్చాయి.

ఏమిటో చేసెయ్యాలన్న ఆత్రం, తపన పుట్టుకొచ్చాయి నాలో. ఆయన ఆరోగ్యం చెడిపోవటం అన్నది నేను ఎప్పుడూ ఊహించని విషయం...

బరువు తగ్గటం విషయం చెప్పాక డాక్టరు శ్రద్ధగా నడుంనొప్పి విషయం పరీక్షచేసి కొద్దిగా ఆర్థ్రైటిస్ తప్ప వేరేమీలేదని మందిచ్చారు. మనసుండబట్టక ఇంకో డాక్టరును సంప్రదిస్తే వేరే పరీక్షలు చేసి ఎమీబయాసిస్ అంటూకడుపులో క్రిములున్నాయని మందులిచ్చారు. మరో డాక్టరు టాన్సిలైటిస్ అంటూ ఇచ్చారు. కడుపులో అల్సర్ రాబోతున్నదంటూ జాగ్రత్తలూ చెప్పారు! అన్ని మందులూ తీసుకునేసరికి నీరసం కొద్దిగా తగ్గిందికాని నొప్పులన్నీ అట్లానే మిగిలిపోయాయి. ఎవరూ చెప్పని మరో జబ్బేదో లోపల మిగిలిపోయిందేమో నన్నట్లున్నారు.

ఏ చీకూ చింతాలేకుండా ఉన్నవాళ్ళకు ఒక్కసారిగా మీద పిడుగుల వర్షం కురిసినట్లుగా అయింది. ఈ చింతలూరిమీదా, ఈ ఇంటిమీదా, ఇందులో వున్న దయ్యంమీదా చాలా అనుమానాలు కలిగాయి. 'ఈ ఊరు వచ్చాకనే యీ జబ్బులన్నీ వచ్చాయి. ఇక్కడి నుండీ వెళ్ళిపోతే అన్నీ సర్దుకుపోయి బాగుంటామేమో' అన్న ఉద్దేశ్యం గట్టిగా ఏర్పడింది నాలో.

ఆయనా అలాగే అంటున్నారు. అప్పుడు ఈ ఊరినుండీ బదిలీకోసం ప్రయత్నం ప్రారంభించాము. ఆయన హైదరాబాద్ వెళ్ళి పైఅధికారితో మా పరిస్థితి చెప్పారు. మా సొంత ఖర్చుమీదనైనా ఏదో ఒక ఊరికి వెళ్తామని కూడా చెప్పారు. 'జబ్బులు ఏ వూళ్లో వున్నా వస్తాయి. మందులు వేసుకుంటే పోతాయి. ఇంకో ఊళ్ళో వుంటే రావని ఎట్లా చెప్పగలరు? అదీ కాకుండా సంవత్సరం మధ్యలో ట్రాన్స్‌ఫర్లు యివ్వాలంటే చదువుకుంటున్న పిల్లలుండే వాళ్ళకు కష్టం. మీరు ఇంతదూరం రానక్కర్లేదు. మీకు ఏ ఊరు కావాలో రాసి రిక్వెస్టు పెట్టుకోండి. జూన్‌లో చూస్తాం' అని చెప్పిపంపారు.

సరే, యీ నాలుగునెలలూ గడిపితే బయటపడ వచ్చునుగదా అని ధైర్యం తెచ్చుకున్నాం. ఇది ప్రమోషన్ కాదు. ఇందులో ఒకరు మనకు ప్రత్యేకంగా చూపించవలసిన మన్నన ఏమీలేదు. ఎందరికో ఇవ్వబడే చిన్న బదిలీనే కదా, రాకపోతుందా! అనుకున్నాం.

అంతలోగా యీ ఇంట్లోంచి మారిపోతే బాగుంటుందనుకున్నాం. దయ్యాలున్నవా? లేదా? ఇళ్ళు అచ్చిరావడం, రాకపోవడం అన్నది నిజమా, కాదా? ఇటువంటి చర్చలతో నాకు పనిలేదు. ఈ పరిస్థితుల్లోంచి బయటపడాలి అన్న ఆరాటంలో ఆలోచనకు తావులేదు. కాని యింత చిన్న ఊళ్ళో మరో ఇల్లు దొరకదు అని తెలిసింది. 'బదులు' అనేది లేదు-జీవితంలో లాగానే. మనుష్యులు కొన్ని పరిస్థితుల్లో చిక్కుబడి వుండవలసిందే.

కథా నిలయం
5447
శ్రీకాకుళం

జబ్బుల్లో అధైర్యంలో బదిలీకోసం ఎదురుచూడ్డంలో మరో ఏడాది గడిచిపోయింది. ఏ ఊళ్ళో ఖాళీపడిందని తెలిస్తే అక్కడికి మమ్మల్ని వెయ్యమని ఎప్లికేషన్లు పెడుతూనే వున్నారు. వేరేవాళ్ళను వేసేస్తున్నారు. మాకు మాత్రం చలనం రావటం లేదు.

బలంగా పెరగాల్సిన పిల్లలు క్షీణిస్తున్నారు. ఇంట్లో వున్నంతసేపూ పిల్లలతో కులాసాగా కాలంగడిపే ఆయన నీరసంగా పడుకుని వుంటున్నారు. ఏదో ఒకటి చెయ్యకపోతే ఎట్లాగ? అని అడుగుతున్నందుకు ఆయనకు నా మీద విసుగొచ్చింది.

"నీవు బాగానే వున్నావుగా" అన్నారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. 'అవునే, నేను ఎట్లా బాగున్నాను?' అనుకున్నాను. ఇన్నాళ్లూ నాకేదో పెద్ద జబ్బులు చేసినట్లు బాధపడిపోతున్నాను. నిజానికి నాకు ఒక్క మామూలు జ్వరం కూడా రాలేదు! నేను ఆనందా బాగుండి పోయాం ఎట్లాగో... వాడొక మొద్దు వెధవ. ఎప్పుడూ నవ్వుకుంటూ తిరగటం తప్ప మరే పని లేదు. వాడిని చూసి పొంగిపోవటం, ఇన్ని చీకాకుల్లోగూడా నాకో అలవాటైపోయింది. అందరూ జబ్బుపడుతుంటే మేము బాగుండటం చాలా తప్పుగా తోచింది నాకు...

బలాబలాలు కులాలు ప్రాంతాలు అంటూ ఎన్నో విషయాలు ఆధారంగా మంత్రులు నియమించబడుతున్నారు. కొత్తగా మంత్రిగా నియమింపబడిన నాగప్పగారు ఈ శాఖ ఆధ్వర్యం పుచ్చుకున్నారు. ఆయన రాజకీయాల్లో ఢక్కామొక్కీలు తిన్నవారు. లోకంపోకడ జీర్ణించుకున్నవారు. తెలుగు ఎక్కువ తప్పులులేకుండా మాట్లాడుతూ ధారాళమైన ఉపన్యాసాలు ఇవ్వగలరు.

వారి జీవితానుభవంనుంచీ కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఏర్పరచుకున్నారు. ఈ ప్రపంచమంతా రాజకీయాలు, డబ్బు అన్న ప్రాతిపదికలమీద నిలబడి నడుస్తున్నదనీ, అవి రెండూ అర్థం చేసుకున్నవాడు ఏ శాఖనైనా అవలీలగా పరిపాలించగలడనీ నిశ్చయించుకున్నారు.

ఈ మంత్రి పదవి అనేది నిలకడలేనిది. పోయిన ఎలక్షన్లలో ఖర్చుపెట్టిన డబ్బూ, రాబోయే ఎలక్షనుకు ఖర్చుపెట్టవలసిన డబ్బు, తనకు సుఖంగా మనుగడ జరిగిపోవడానికి కావలసిన డబ్బూ అన్నీ ఈ కొద్దికాలంలోనే సంపాదించవలసిన అగత్యం వున్నది. అందువలన ఏ మంత్రిగారు లేక ఏ యంఎల్ఏగారు ఈ పని చెయ్యమంటున్నారు, ఇందులో మనకు ఎంత డబ్బు ముడుతుంది? అన్న రెండు-ముఖ్యంగా రెండోది- ప్రస్తుతాంశాలుగా భావించి వారి శాఖలోని ఉద్యోగులతో ప్రమేయం లేకుండానే మంత్రిత్వం నిర్వహించడం ప్రారంభించారు.

ఆయన పద్ధతివలన వారి శాఖ తలక్రిందులు కాలేదు. ఉద్యోగులలో

కొంతకాలంపాటు అసంతృప్తి ప్రబలింది. కాని రానురాను పరిస్థితుల్ని అర్థం చేసుకొని దానికే అలవాటుపడిపోయారు. ట్రాన్స్‌ఫర్ కావాలంటే ఫలానావాళ్ళకు ఫలానావాళ్లద్వారా ఫలానా మొత్తం ఇవ్వాలి. ప్రమోషన్ కావాలంటే ఇంత మొత్తం, ఉద్యోగానికైతే ఇంత మొత్తం... ఇటువంటి విషయాలన్నీ స్థిరపడిపోయాక అందరికీ కొంతవరకు ప్రశాంతి లభించింది. 'వాళ్లనీ వీళ్ళనీ ప్రాథేయపడి కాలం వృథా చేసుకోకుండా ఇదీ బాగానే వున్నది' అనుకున్నవాళ్లూ వున్నారు. ఏది కావలసినవాళ్ళు దానికి తగిన పని చేస్తే కోరినపని జరుగుతుందని తెలుసుకొని అలాగా చేసుకుంటూ పోవటం ఆరంభించారు జనం.

'గవర్నమెంటువారికి వినతిపత్రం సమర్పించుకొని కూర్చుంటే పని జరగదు సుమండీ. ఎక్కడెక్కడ చమురు వెయ్యాలో అక్కడ వేస్తుంటే కదా యంత్రం సవ్యంగా పనిచేసేది! లోకంతీరు గమనించండి. ఒంట్లో ఆరోగ్యంలేక బాధపడుతూ సంవత్సరంన్నరనుండీ అక్కడే ఉండిపోయారు పాపం. నేను నాలుగునెల్లు కూడా ఉండలేకపోయాను...ఇప్పుడు వరంగల్లులో ఖాళీ ఉన్నదికదా! నేను అక్కడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలనుకున్నాను. అది పెద్దఊరు గనక అక్కడ వుంటే హోదాగా వుంటుందని అనుకున్నాను' అంటూ చెప్పారుట సుఖదేవ్‌గారు ఏదో మీటింగులో కనబడి.

వరంగల్లులో ఏడాదిన్నరగా ఖాళీ వున్నది. మమ్మల్ని అక్కడికి వేస్తే సొంత ఖర్చులతో వెళ్తామని ఏడాదిక్రితంనుండి అడుగుతున్నారీయన. సుఖదేవ్‌గారు ఇలా చెప్పిన పదిహేను రోజులకు గవర్నమెంటు ఖర్చుతో అతన్ని వరంగల్లు పంపారు! ఇలా ఎదురు చూడటంలో మనసు విసిగిపోయింది. బదిలీ అనేది ఒట్టి అవివేకపు మాట. ఈ ప్రపంచంలో బదిలీ, బదులు అనేవి లేవు. 'అయితే' అనేది వ్యర్థమైన ఊహాగానం. 'ఉండేది' ఉన్నది. 'అయితే', 'అయివుంటే' అనేవి లేవు. లేనివాటిగురించి ఆలోచించడం, ఆశించడం అవివేకం. పరిస్థితులతో రాజీపడుతూ పోవటమే జీవితం అంటే...

ఇటువంటి నిస్పృహలో ఉండగా మరో ఆశాకిరణం కనిపించింది. నల్గొండలో వుండే అధికారి మరో ఊరు బదిలీ చేయించుకోబోతున్నట్లు తెలిసింది. పోనీ ఈ సందర్భంలోనైనా మమ్మల్ని కదిలిస్తారేమోనన్న ఆశతో, మమ్మల్ని నల్గొండకు మార్చమని ఇంకో రిక్వెస్టు పెట్టుకున్నారు. తరువాత చాలా రోజులవరకూ దానికోసం ఎదురుచూస్తూ వుండిపోయాం.

ఏ పనిమీదనో హైదరాబాదు వెళ్ళివచ్చినవాళ్ళు అక్కడి వార్తలు తెస్తున్నారు. 'మిమ్మల్ని నల్గొండ వేస్తున్నారట' అంటూ. అయితే నెలలు గడిచిపోతున్నా ఆ ఆర్డరుమాత్రం రాలేదు. ఆ ఫైలు మంత్రిగారి దగ్గరకుపోయిందట. అన్ని విషయాలూ

వారే స్వయంగా పరిశీలిస్తున్నారట.

అమ్మయ్య! అని దీర్ఘనిశ్వాసం తీసుకున్నాము. ఎలాగూ ఎండా కాలం సెలవులొస్తున్నాయి. రామూని ఏకంగా నల్గొండ హైస్కూల్లో చేర్పించవచ్చును. అక్కడ మంచి స్కూలు వున్నదట. జగన్‌ని ఇప్పటికైనా కాస్త సుమారుపాటి ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించవచ్చును. నీళ్ళు మారితే, ఊరుమారితే ఈ వింతజబ్బులు తగ్గకపోతాయా! మళ్ళీ ఇదివరకట్లాగా సుఖంగా వుండకపోతామా! అనుకున్నాం, ధైర్యం కూడదీసుకుంటూ.

జూన్‌లో స్కూళ్ళు తెరిచారు. ట్రాన్స్‌ఫర్ ఫైలు మంత్రిగారి దగ్గర్నుంచి ఎందుకో క్రిందికి వచ్చిందట. అంతా పూర్తయ్యేసరికి మరో రెణ్ణెల్లు పట్టవచ్చును అన్నారు. రెండు నెలలేకదా. ఎలాగో దాటలేకపోతామా! అనుకున్నాం.

ఇంతలో రామూకి కొత్తరకం జ్వరం పట్టుకున్నది. రోజూ మధ్యాహ్నం జ్వరంవచ్చి సాయంకాలానికి తగ్గిపోతున్నది. పిల్లవాడు దినదినానికీ క్షీణించడం ప్రారంభించాడు. పట్నం తీసుకెళ్ళి ఒకరితర్వాత ఒకరుగా ముగ్గురు డాక్టర్లకు చూపించాం. వాళ్ళు రక్తమూ మలమూత్రాలూ, ఎక్స్‌రే వగైరాలన్నీ పరీక్షించి జబ్బేమీలేదు, అదే తగ్గిపోతుందన్నారు. ఆఖరుకి ఒక డాక్టరుగారు వాడికి బ్లడ్ క్యాన్సర్ కోసం పరీక్షించాలన్నారు.

అసలు మేము ప్రాణాల్తో ఈ ఊరినుండి బయటపడతామా! అన్న నిస్పృహ కలిగింది. ఎల్లాగూ ఇంకో రెండు నెల్లల్లో నల్గొండకు ట్రాన్స్‌ఫర్ ఒస్తుంది. అందాకా పిల్లల్ని తీసుకుని మా ఊరికి వెళ్ళి తాత్కాలికంగానైనా ఈ బాధ తప్పించుకోవాలని పించింది. డబ్బుకి యిబ్బంది అయినా ఈ రెణ్ణెల్లువెళ్తే... నేను అనుకుంటూ వుండగానే నల్గొండకు వేరే ఎవర్నో వేసేశారనీ, ఇప్పట్లో మాకు మార్పు రాదనీ తెలిసింది.

తరువాత రెణ్ణెల్లలోనూ మూడుసార్లు ముసురుపట్టింది. పదిరోజులు ఒకటే వరుసన వానపడింది. ఆకాశం మురికిరంగు పులుముకుని వానమబ్బుల్తో మూసుకుపోయి వుంటున్నది. చిక్కంగా, పట్టుకుంటే దొరికేట్లున్న ఆ వాతావరణం ఎన్నోవిధాలుగా పీడించబోయే అనారోగ్యాన్ని సూచిస్తున్నట్లుంది. పంచభూతాలూ కలిసి ప్రపంచాన్ని నాశనం చెయ్యాలని నిర్ణయించుకున్నాయా? అనిపిస్తున్నది. ఈ లోకాన్ని నలిపివెయ్యడానికి ముసురుపట్టిన ఆకాశం కిందికీ, ఇంకా కిందికి యీ భూమిమీదకు దిగివచ్చేస్తున్నది. ఇది ఒక శ్మశానం, ఒక సమాధి.

ఈ రెండు నెల్లలోనూ ఊళ్ళోంచి మూడు శవాలు వెళ్ళినై. జంగంవాని శంఖారావం నిత్యం వినబడుతున్నట్లే వున్నది. రాత్రిళ్ళ కుక్కలు ఒకటే ఏడుపు.

ఈ వాతావరణం నా గుండెను పిండేస్తున్నది. ఏమిటో భయం. మా ఊళ్ళో కొండలూ, చెట్లూ తేలిగ్గా పరుగెత్తేగాలీ, నిర్మలమైన ఆకాశమూ, వెలుగునింపుకున్న

విశాలమైన ప్రపంచమూ ఉన్నాయి. అక్కడికి వెళ్ళిపోవాలి... తొందరగా... వెంటనే... అందరూ బాగుండగానే... ఏ విధంగానైనా సరే...

వరంగల్లు ట్రాన్స్ఫర్‌కోసం సుఖదేవ్‌గారు నాగప్పగారికి రెండువేలరూపాయలు బహూమానమిచ్చారుట. అది 'పై సంపాదన' బాగా దొరికే వూరుగనుక సుఖదేవ్‌గారు ఖర్చుపెట్టినదానికి ఈ ఏడాదిలోనే ముబ్బడిగా సంపాదించగలనన్న నమ్మకంతో ఉన్నారుట. ...మాకు అల్లాంటి సంపాదన అక్కర్లేకపోతే మానెకాని ఈ మహాశ్మశానంనుంచీ బయటపడటానికి ఇవ్వవలసినవాళ్ళకు వెయ్యో రెండువేలో యిస్తేనేం? అనుకున్నాను. మంచిగా నీతిగా ఉన్నందువలన రవంతైనా మంచి జరగలేదు సరికదా, మూడేళ్ళబట్టీ ఈ ఊళ్లో ఘోరమైన అశాంతిలో చిక్కుబడిపోయాము! 'మంచి'గా వుండకపోతే ఎప్పుడో బయటపడివుందుము. ఇప్పటికైనా ఆ విషయం తెలుసుకున్నాంగనుక ఇక్కణ్నుంచి బయటపడొచ్చు. మనిషైనందుకు ఆలోచించగల మనసున్నందుకు మంచీ చెడ్డా ఆలోచించుకుని ముందడుగు నిర్ణయించుకోవాలి.

కాని ఈ విషయంలో ఆయన ఉద్దేశ్యాలు వేరుగా ఉన్నవి. 'ఇట్లాగ లంచాలిచ్చి పనులు చేయించుకునే వ్యవహారం సరైనది కాదు. ఒక పని మంచిది కాదు అనుకున్నాక ఆ పని నేను చెయ్యను. అది నా స్వభావానికి విరుద్ధం' అన్నారు.

ఏమిటా స్వభావం? అది మనిషిని అంతగా బంధించేస్తుందా? లోకం తీరుతో సంబంధం లేకుండా, మనిషి కష్టసుఖాలతో సంబంధం లేకుండా, చెయ్యవలసిన పనులను నిర్ణయించే ఆ 'స్వభావం' ఎక్కడనుంచీ వచ్చింది? అసలు బతికివుంటే గదా స్వభావం ప్రసక్తి రావాలి! పుట్టెడు జబ్బులో మునిగి వున్న వాళ్ళకి స్వభావం ఏమిటి? బతుకుకంటే స్వభావం వుంటుందా!

"నీతి న్యాయం అనేవి దేశకాలాలతో మారుతూ వుండేవి. వాటికి అంతకంటే ఎక్కువ విలువ ఎందుకివ్వాలి? లంచం యివ్వడం పుచ్చుకోవడం అనేది ఈ కాలంలో సర్వసాధారణం అయిపోయింది. ఇంతమందికీలేని తప్పు మనకిమాత్రం ఎక్కణ్నుంచీ వచ్చిందండీ? మీరనే తప్పు చేస్తున్నవాళ్ళు కోరుకున్నచోట కోరుకున్నట్లు సుఖంగా వుంటున్నారు. మనమేమో ఎక్కడ పడవేస్తే అక్కడవుండే గొంగళిలాగా యిక్కడే ఉంటూ నానాటికి దిగజారుతున్న ఆరోగ్యాలతో చచ్చిపోతున్నాం... ఆ రాముా ముఖం చూసి సిద్ధాంతాలు మాట్లాడండి. మీ విషయంలో మీరు ఎల్లాంటి నిర్ణయమైనా తీసుకోవచ్చును. కాని పిల్లల్ని మార్గాంతరం వుండీ, ఇక్కడే పెట్టడం న్యాయమేనా?... ఏదో ఒకటి ఈ ఒక్కసారికి నలుగురితోపాటు నడిచి ఇక్కణ్నుంచి బయటపడ్డాక మీ ఇష్టం వచ్చినంత మంచిగా ఉందురుగాని..."

ఎన్ని విధాలుగా చెప్పినా ఆయన మొండితనం విడువలేదు. నా బాధ

ఆయనకర్థంకాదు. ఆయన స్తబ్ధత, చేతగానితనం మా అందరికీ గుదిబండయై అందర్నీ నేలకీడుస్తున్నది. మాకు ఈ నరకంలోనుంచీ విమోచనం లేకుండా చేస్తున్నారు చేజేతులా!

"ఏ క్షణానికాక్షణం ఏది మంచిదని తోస్తే అట్లా చేసుకుపోవచ్చునని, అది మన చేతిలో వుందనీ నీవనుకుంటున్నావు. తప్పూ ఒప్పూ అనేవి ఆ మనిషి మనసుకూ స్వభావానికీ సంబంధించినవి. నీ చేతికి ఒక కత్తి యిస్తే ఆ దోవన పోయేవాడిని పొడవగలవా? ఒకడు కారణం లేకుండానే పొడవగలడు. ఒకడు ఆత్మరక్షణకోసమైతే పొడవగలడు. మరొకడు ఆత్మరక్షణకోసం కూడా పొడవలేకపోవచ్చును. స్వభావం అనేది మనిషిని నియమిస్తున్నది కదా. దాన్నిబట్టే మనిషి మనసు తప్పూ ఒప్పుల్ని నిర్ణయిస్తుంది...ఇహ స్వభావం అనేది మనిషిని ఎంతవరకు నియమించగలదు? తప్పు అనుకున్న పని మనిషి చెయ్యలేడా? అన్న ప్రశ్న రావచ్చును. ఆలోచన, తర్కం ఆధారంగా చేసుకుని, ఈ క్షణంలో కనిపించిన కష్టం దాటడానికని, స్వభావవిరుద్ధమైన పనులు, తప్పు అని తెలిసీ, మనసుని ఎట్లాగో సమాధానపరుచుకుని చేస్తారు. ఇదిగో, ఇప్పుడు నీవు చెప్పడంలా. అట్లాగే! కాని నిజాయితీ ఉండేమనిషి అట్లా చేసినప్పుడు మానసికంగా సంఘర్షణకు గురైపోయి అశాంతి పాలౌతాడు..."

అక్కణ్ణుంచీ లేచి వెళ్ళిపోయాను. ఈ సిద్ధాంతాల్లో నాకు ఆసక్తీ లేదు. అవి నాకు అర్థమూ కావు. ఈ ఊళ్ళోంచి బతికుండగానే బయటపడేమార్గం ఏమిటా అని సతమతమైపోతుంటే స్వభావం, కత్తులు అంటూ ఉపన్యాసం యిచ్చేమనిషిని ఏమనాలి! ఇట్లాగ సిద్ధాంతాలమీద ఆధారపడి జీవితాన్ని నడుపుకునేవాళ్లు, కష్టాల్ని చేజేతులా కొని తెచ్చుకునే వాళ్ళు నిజంగా ఉంటారని... నాకు అవన్నీ ఎందుకు? అక్కర్లేదు! అక్కర్లేదు. నేనూ నా వాళ్ళూ బతికి బాగుండాలని నా ఆశ. అంతే.

...ఆ రోజున జరిగిన సంఘటనలన్నీ నా మనసులో ముద్రవేసినట్లు నిలిచిపోయాయి. ఆనాటి ప్రతిమాటా చేతా రోజుకి అనేకమార్లు నాలో పునరావృతం అయ్యాయి. నేను ఆ రోజులోనే నిలిచిపోయాను. బయటపడాలన్న కోరిక ఏ మాత్రమూ లేదు నాలో.

ప్రతి శనివారం సాయంత్రంపూట ఒక గంటసేపు ప్రశాంతంగా తబలా, తాళాలు వాయిస్తూ భజన చేసుకోవడం మాకు అలవాటు. ఆరోజున ఆయనతో బాగా ఘర్షణపడి చాలా నిస్పృహలో ఉన్నాను. భజనకు వెళ్లకుండా రాత్రికి పూరీలు చెయ్యడానికి వెళ్ళాను...కాల్చిన పూరీ గరిటెతో పైకెత్తి పట్టుకున్నదా తిరిగి నూనెలోకి ఎట్లా జారిందో నేను గమనించలేదు... సెగలుకక్కే నూనెచినుకులు నా చేతినిండా, మొహంమీదా చిందిపోయినై. నూనెపడినచోట్ల భగభగా మండుతున్నది. స్టౌ ఆర్పేసి బయటికివచ్చి

కూర్చున్నాను. మృత్యుదేవత నన్ను మింగివెయ్యాలని మీదికొస్తున్నట్లు భయం. ఒళ్లు స్వాధీనంలో లేకుండా ఒణికిపోతున్నది. అందర్నీ కేకలేసి పిలిచి నాకు జరిగిపోయిన ఈ ప్రమాదాన్ని గురించి చెప్పెయ్యాలనిపించింది. అంతలోనే ఎవరిమీదో ఏమిటో కసి. 'ఎవ్వరితో చెప్పకూడదు. వాళ్ళు చూసి అడిగినప్పుడే చెప్పొచ్చునులే' అనుకున్నాను.

ఈ స్థితిలో మనసునిండా ఒకటే ప్రశ్న. "ఎందుకు నాకు ఇట్లా జరిగింది?" అన్న ప్రశ్న. "పూరీ నూనెలోపడి నూనె చిందింది" అన్నది దానికి సమాధానం కానేకాదు. దానికి సమాధానం చావుపుట్టుకలను సమన్వయంచేసే ఇంకో స్థాయిలోనుండే రావాలి.

ఎందుకు? ఎందుకు అట్లా జరిగింది?

ఇది జీవన్మరణ సమస్య. ఏమిటో, ఎందుకో,ఎక్కడో భయం. అర్థంకాని భయం.

ఆనంద వచ్చాడు, నవ్వుతూ, "అమ్మా, దా" అన్నాడు.

ఎక్కడికి? ఎందుకు? అసలు ఆ నవ్వెందుకు వాడి మొహాన? నాలో కోపం ఉవ్వెత్తుగా లేచింది. వాడి వీపుమీద చెళ్ళున వేశాను దెబ్బ.

"పోరా, పో, ఎందుకొచ్చావు? ఎప్పుడూ నన్ను పీడిస్తావెందుకురా! కాస్సేపు నాపాటికి నన్ను బతకనివ్వవే... శనివెధవ... చావనన్నా చావవు..." తిడుతున్న కొద్దీ కోపం రేగిపోయింది.

కాసేపు నిల్చుని చూసి వెళ్ళిపోయాడు.

నిదానంగా ఒంటిమీద మంటలు తగ్గాయి. అర్థంలేని ఆ భయమూ శాంతించింది. పూజ గదిలోనుంచీ పాటలూ వాద్యాలూ వినబడుతున్నాయి. నాకు జరిగిన ప్రమాదం గురించి ఎవరికీ చెప్పకూడదు అనుకున్నాను ఉదారంగా. పూరీలపని పూర్తి చేసుకున్నాను. రాముడూ తీర్థం, ప్రసాదం తెచ్చి యిచ్చాడు.

గంటసేపు గడిచాక అందరూ భోజనాలకు వచ్చినప్పుడు ఆనందలేడని తెలిసింది. మర్నాడు ఇంటివెనుక చెరువులో దొరికాడు... నా ఆనంద... నా...

ఆ చివరి దృశ్యాన్ని ఎన్నో వందలసార్లు పునఃసృష్టి చేసుకున్నాను. బాగా పరిశీలించి చూశాను. వాడు ఎందుకు అట్లా వెళ్ళిపోయాడు. నేను చావమంటే చచ్చిపోయాడా?... ఒకటిమాత్రం నాకు రూఢిగా తెలుసు. నేను కొట్టినందుకు వాడికి కోపంగాని ఏడుపుగాని లేదు. వాడు ఎందుకు చచ్చిపోయాడు! ఎందుకు వెళ్ళిపోయాడు?

"అయ్యో, దేవుడిపూజ జరుగుతున్నప్పుడు పసివాణ్ని పాడుమాట ఎందుకన్నావు?" అత్తగారు అదేమాట ఎన్నోమార్లు అన్నది. పూజ జరిగేటప్పుడు పాడుమాట అనకూడదా? అంటే జరుగుతుందా? ఇప్పుడు జరిగిందే! దేవునికీ మాటకీ సంబంధం ఒచ్చిందే! ఎక్కణ్నుంచీ వచ్చింది? సరిగ్గా అటువంటి సమయంలో ఆ మాట వాణ్ని ఎందుకన్నాను??

స్వభావం అనేది మనిషికి ఉండటం నిజమైతే, నా స్వభావం ఆనందకు తల్లిగా

వుండటం. నేను ఈ క్షణంలో బ్రతికేదాన్ని. ఆనందకు తల్లిని. అంతకుమించి నేను ఎవర్నీ కాను!

ఒక్కోసారి నేనూ వాడితోపాటే చచ్చిపోయాననుకుంటాను. ఇంకోసారి వాడూ నాతోపాటే బతికున్నా డనుకుంటాను. నిజం ఏమిటో సరిగ్గా తెలియదు నాకు.

ఈ చింతలూరికి వొచ్చి నాలుగేళ్ళయింది. నాలుగేళ్ళు! అంతకాలం నా బిడ్డను లాలిస్తూ దండిస్తూ కోపిస్తూ విసుక్కుంటూ తిట్టుకుంటూ... ఎంత ఆనందం అనుభవించాను. కాని అది ఆనందం అని అప్పుడు నాకు తెలియలేదు. అన్నీ వేరువేరుగా దండనగా కోపంగా విసుగ్గా కనిపించాయి. వాటిల్లో... అక్షణాల్లో... మునిగిపోయాను.

అకస్మాత్తుగా ఆ శనివారంతో అన్నీ క్షణికమైపోయాయి. అన్నీ నిత్యమైపోయాయి.

ఇప్పుడు ఆ బదిలీ వచ్చినా రాకపోయినా ఒకటే. ప్రపంచమే నాలోకి బదిలీ అయిపోయింది. ఇప్పుడు నేనే ప్రపంచాన్ని...

★★★